సాక్షి ఆదిలాబాద్

శనివారం । 29 । జూలై । 2023

కలెక్టర్‌కూ తప్పని బురద తిప్పలు



నేరడిగొండ మండలంలో వర్షాలతో దెబ్బతిన్న పొలాలు, రోడ్లను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌కు బురద తిప్పలు తప్పలేదు. మండలంలోని బోరిగామ గ్రామానికి శుక్రవారం వెళ్తుండగా బ్రిడ్జి వద్ద బురద చిత్తడిగా మారింది. దీంతో కలెక్టర్ ఇలా బ్రిడ్జి సైడ్ వాల్‌ను అనుకుని వెళ్తున్న దృశ్యమిది. - నేరడిగొండ

గరిష్టం/కనిష్టం
30.0 /24.0

వాతావరణం

వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండి పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా కుష్బూ గుప్తా



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా కుష్బూ గుప్తా నియామకమయ్యారు. ప్రస్తుతం నల్గొండలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈమెను ఆదిలాబాద్‌కు నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె 2019 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. ఇదివరకు అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన రిజ్వాన్ బాషా షేక్ మే 21న వరంగల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఈ పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉంది. ఈమె సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లుగా అధికార వర్గాల సమాచారం.

ఉట్నూర్ ఆర్డీవోగా జివకర్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఉట్నూర్ ఆర్డీవోగా ఎల్. జివకర్ రెడ్డి నియామకమయ్యారు. ఈయన పదోన్నతిపై రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన కదం సురేశ్‌ను ఇదివరకే బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

ముగిసిన న్యాక్ బృందం పరిశీలన



మొక్క నాటుతున్న న్యాక్ బృంద సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో న్యాక్ బృందం పరిశీలన శుక్రవారం ముగిసింది. చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్, విలాస్ ఎస్.కడ్రోల్కర్, జవియ వేదంతో కూడిన ఈ బృందం రెండు రోజుల పాటు కళాశాలలోని వసతులు, సౌకర్యాలు, విద్యాబోధనను పరిశీలించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పలు అంశాలతో కూడిన నివేదికను సిద్ధం చేసిన న్యాక్ బృందం ఆ నివేదికను సీల్డ్ కవర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ అనితకు అందజేశారు. గ్రేడ్‌ను ప్రకటించిన తర్వాతే ఆ సీల్డ్ కవర్ తెరవాలని సూచించారు. బృందం చైర్మన్‌తో పాటు సభ్యులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు. ఏ గ్రేడ్ వస్తుందని యాజమాన్యం, అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

కైలాస్‌నగర్: మణిపూర్‌లో శాంతి నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న అల్లర్లలో వందలాది మంది హత్యకు గురవుతున్నారన్నారు.మహిళలు, బాలికలపై దా డులు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హింసాకాండను అరికట్టేలా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. అనంతరం ఆర్డీవో స్రవంతికి వినతిపత్రం అందజేశారు.

ఎంపిక పోటీలు వాయిదా

ఆదిలాబాద్: తెలంగాణ క్రీడా పాఠశాల ప్రవేశాలకు సంబంధించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు వాయిదా పడినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 31నుంచి ఆగస్టు 6వరకు నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈపోటీలను ఆగస్టు 6 నుంచి 13వరకు నిర్వహించనున్నట్లు తెలి పారు. కుమురంభీంఆసిఫాబాద్, మంచిర్యా ల జిల్లాలకు ఆగస్టు 7న, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 8న పోటీలు ఉంటాయని తెలిపారు. విషయాన్ని గమనించాలని సూచించారు.

'విద్యార్థి సంఘాలను అనుమతించకపోవడం సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలు, మీడియాను అనుమతించకపోవడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిడాం సాయికుమార్, అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. రాష్ట్ర సాధనలో విద్యార్థి సంఘాలు, మీడియా క్రియాశీలక పాత్ర పోషించారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రవీందర్, వినోద్ పాల్గొన్నారు.



ఈ రైతు పేరు ఎస్‌కే చాంద్. భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామం. ఇటీవల పెన్‌గంగ ఉధృతిగా ప్రవహించడం, గ్రామంలో కురిసిన వర్షానికి బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో చేను పూర్తిగా నీటితో నిండిపోయింది. మూడెకరాల్లో పత్తి పనికి రాకుండా పోయింది. నష్టం రూ.60వేల వరకు ఉంటుంది. ప్రస్తుతం నీళ్లు అక్కడ లేకపోగా మొత్తం జౌకు పట్టడంతో చేనులోకి దిగే పరిస్థితి లేదు. మొక్కలు వడలిపోయాయి. పంట తేరుకోవడం కష్టమే. జిల్లాలో వేల ఎకరాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి.



ఇది ఇంద్రవెల్లి మండలంలోని లాల్‌టేక్డి పంచాయతీరాజ్ రోడ్డు. భారీ వరదల కారణంగా ఇలా మధ్య భాగం నుంచి పూర్తిగా కోసుకుపోయి ఆనవాళ్లు కోల్పోయింది. జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టులు ఇలా నామరూపాలు లేకుండా పోయాయి. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. వాటి తాత్కాలిక, పూర్తిస్థాయిలో మరమ్మతుకు ఎంత అవసరమవుతుందనే అంచనా వ్యయం రూపొందించి ప్రభుత్వానికి పంపించారు.



ఇటీవల కురిసిన వర్షాలకు నేరడిగొండలో ఓ ఇంట్లోకి వచ్చిన వరద నీటిని ఇలా తోడి బయటకు పడేశారు. ఈ మండలంలో అనేకగ్రామాల్లో ఇళ్లలోకి ఇలాగే వరద నీరు చేరింది. బోథ్ మండలం ధన్నూర్‌లోనైతే గ్రామాన్నే వాగునీరు చుట్టుముట్టింది. జిల్లాలోని పలు గ్రామాల్లో వరద ఇళ్లలోకి ప్రవేశించడంతో నిత్యావసర సరుకులు తడిసిపోవడం, విలువైన సామగ్రి కొట్టుకపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వారి జీవనానికి కోలుకోలేని పరిస్థితి ఎదురైంది.

అపార నష్టం

- భారీ వర్షాలు మిగిల్చిన చేటు
- పంటలు కోల్పోయిన రైతులు
- దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జీలు.. పలుచోట్ల తెగిన కల్వర్టులు
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అస్తవ్యస్తం
- గూడు కోల్పోయి పలువురు విలవిల
- వరదలతో నిత్యావసరాలు తడిచి జీవనానికి ఆటంకం



సిరికొండ మండలంలో పంట చేనులో ఇసుక మేట

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో కురిసిన భారీ వర్షాలు అపార నష్టాన్ని మిగిల్చాయి. పంట పొలాలు కకావికలం అయ్యాయి. రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టులు నామరూపాలు లేకుండా పోయాయి. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడికక్కడ పడిపోయాయి. పలువురు ఇళ్లు కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ముంచెత్తిన వరదలతో నిత్యావసర సరుకులు కూడా కోల్పోయిన పలువురు నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటనలు..

కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ మండలాల్లో పర్యటించి నష్టాన్ని పరిశీలించారు. కాగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ వరదల వల్ల నష్టపోయిన జనాలను కలుస్తున్నారు. ఆర్థిక సాయం, సరుకులు అందజేస్తున్నారు.



తాంసి మండల కేంద్రానికి చెందిన ఈయన ఎస్.అంబదాస్. ఇటీవల కురిసిన వర్షాలకు తన ఇల్లు కూలిపోయింది. జిల్లాలో ఇలా పదుల సంఖ్యలో ఇండ్లు కూలిపోయి పేదలు రోడ్డున పడ్డారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.



ఈయన పేరు నారాయణ. నేరడిగొండ మండలం గుత్పాల గ్రామం. ఏటా వర్షాకాలం వచ్చిందంటే ఇళ్లలోకి వరద నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా మాకు నరకయాతనే అని వాపోతున్నాడు. ఇళ్లలోకి వర్షపు నీరు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నాడు.



ఇక్కడ కనిపిస్తున్నది బాన రమేష్. ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకోలి గ్రామం. ఈయనకు చించుఘాట్ శివారులో ఏడెకరాల చేను ఉంది. అందులో నాలుగు ఎకరాలు పత్తి, మూడెకరాల్లో సోయా సాగు చేశాడు. పక్క నుంచే మెట్టివాగు ప్రవహిస్తుంది. రెండు రోజుల కింద కురిసిన భారీ వర్షాలకు పత్తి, సోయా పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. చేనులోకి పెద్ద పెద్ద బండరాళ్లు వచ్చి చేరాయి. సుమారు రూ.1లక్ష 45వేల నష్టం సంభవించిందని చెబుతున్నాడియన.

ఆదుకుంటాం.. ఆందోళన వద్దు

- రోడ్ల మరమ్మతులకు సత్వర చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- పలు మండలాల్లో పర్యటన



కలెక్టర్‌కు తమ సమస్యలను వివరిస్తున్న గుత్పాల గ్రామ మహిళలు

నేరడిగొండ: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు సత్వర మరమ్మతులతో పాటు వరద బాధితులను ఆదుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలో ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లతో పాటు వరద చేరిన ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గుత్పాల గ్రామంలో మినీ గురుకులంను సందర్శించారు. వర్షం వచ్చిన ప్రతీసారి వరదంతా గ్రామంలోకి వస్తుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే బోరిగామలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు వర్షం ధాటికి నేలకొరగడంతో అంధకారంలో మగ్గుతున్నామని గ్రామస్తులు కలెక్టర్‌కు తమ గోడు వినిపించారు. ఎంపీపీ రాథోడ్ సజన్ పంట నష్టం వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఆర్ఐ నాగోరావు, సర్పంచులు వెంకటరమణ, రవి, తదితరులున్నారు.

దుబార్‌పేట్ ముంపు ప్రాంతం పరిశీలన..

ఇచ్చోడ: దుబార్‌పేట్ ముంపుప్రాంతాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. నేరడిగొండ మండలానికి వెళుతూ మార్గమధ్యలో హైవేపై ఆగారు. గ్రామాన్ని వరద ముంచెత్తిన తీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్రెయినీ కలెక్టర్ శ్రీజ స్థానిక కేజీబీవీతో పాటు గ్రామానికి వరద వచ్చే ప్రాంతాన్ని పరిశీలించారు..

రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ఇంద్రవెల్లి: భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మండలంలోని ముత్నూర్ త్రివేణి సంఘం చెరువుతో పాటు కోతకు గురైన ప్రధాన రహదారిని శుక్రవారం పరిశీలించారు.

శాఖల వారీగా నష్టం ఇలా..

పంటల నష్టం
ఎకరాలు: 57వేలు
పంటలు: పత్తి, సోయా, కందులు

ఆర్‌అండ్‌బీ రోడ్లకు..
రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టులు: 27
కిలోమీటర్లు: 15
తాత్కాలిక పునరుద్ధరణ కోసం: రూ.2 కోట్లు అవసరమని అంచనా
శాశ్వత పునరుద్ధరణ కోసం: రూ.152 కోట్లు

పంచాయతీరాజ్ రోడ్లకు..
మొత్తం రోడ్లు: 68
కిలోమీటర్లు: 75
తాత్కాలిక పునరుద్ధరణ కోసం: రూ.6 కోట్లు
శాశ్వత పునరుద్ధరణ కోసం: రూ.153 కోట్లు

విద్యుత్ శాఖకు..
లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు: రూ.48 లక్షలు

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా వైద్యాధికారులతో శుక్రవారం మాట్లాడారు. ప్రసవ సమయం దగ్గర పడిన గర్భిణులను గుర్తించి సమీపంలో ఉన్న సంరక్షణ కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి గర్భిణుల వివరాలను సేకరించాలని ఆదేశించారు. గ్రామాలకు వెళ్లిన ఫొటోలను వైద్యారోగ్య శాఖ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో గర్భిణుల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ నం.7670904306, అపడమిక్ హెల్ప్ లైన్ 8639523332 నంబర్లపై సంప్రదించాలన్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న గర్భిణులను బర్త్ వెయిటింగ్ రూమ్‌కు తరలించాలని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌వో శ్రీకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, ప్రోగ్రాం అధికారి విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

సమాచారమిస్తే సమస్యలు పరిష్కరిస్తాం..



డ్రెయినేజీని పరిశీలిస్తున్న చైర్మన్ ప్రేమేందర్

కైలాస్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో తలెత్తే సమస్యలపై సమాచారమందిస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని కసాబ్‌గల్లి, వెంకట్ రావు కాలనీ, గండేవార్ తోట తదితర కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే మున్సిపల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలోప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ జవాన్లు, సిబ్బంది తదితరులున్నారు.

ఇక నాణ్యమైన భోజనం

- పెరిగిన 'సంక్షేమ' డైట్ చార్జీలు
- జూలై నుంచే అమలు
- జిల్లాలో 24వేల మందికి ప్రయోజనం

పెరిగిన డైట్ చార్జీలు ఇలా.. (రూ.లలో)

తరగతి	ప్రస్తుత చార్జీ	పెరిగిన చార్జీలు
3–7	950	1,200
8–10	1,100	1,400
పోస్టుమెట్రిక్	1,500	1,875



భోజనం తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. జూలై నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలోచదివే విద్యార్థులకు ఇక నాణ్యమైన భోజనం అందనుంది.

జిల్లాలో 24వేల మందికి మేలు

జిల్లాలో ఆయా శాఖల పరిధిలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో 24,050 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఏడు ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 453 మంది, ఏడు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 452 మంది ఉన్నారు. దళిత అభివృద్ధిశాఖ పరిధిలో 19 ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో 1,290 మంది, మూడు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 224 మంది ఉన్నారు. పోస్ట్‌మెట్రిక్ అడ్మిషన్లు కొనసాగుతున్నందున ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 54 ఆశ్రమ పాఠశాలల్లో 15,957 మంది బాల, బాలికలు ఆయా వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. అలాగే 12 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 2,524 మంది ఉన్నారు. ఆరు మైనార్టీ గురుకులాల్లో మూడువేల మంది ఉండగా, ఒక పోస్ట్ మెట్రిక్‌లో 50 మంది, మరో ప్రీమెట్రిక్ వసతి గృహంలో 100 మంది విద్యార్థులున్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించకపోతే అంతే..

ప్రభుత్వం డైట్ చార్జీల బిల్లులను కొన్నేళ్లుగా సకాలంలో చెల్లించడం లేదు. దీంతో సంబంధిత హెచ్‌డబ్ల్యూవోలు మెనూ ప్రకారం భోజనం అందించకుండా ఉన్న దాంట్లోనే సర్దుతున్నట్లు విమర్శలు లేకపోలేదు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచడం సంతోషకరమే. అయితే బిల్లులు సకాలంలో చెల్లిస్తేనే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాలకు సంబంధించిన డైట్ చార్జీలు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ఎస్సీ, బీసీ శాఖలకు సంబంధించినవి 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. సత్వరం బకాయిల విడుదలతో పాటు పెంచిన డైట్ చార్జీలను ప్రతినెలా అందిస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని హెచ్‌డబ్ల్యూవోలు అంటున్నారు.

ఇంకా ఉత్తర్వులు రాలేదు



సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల డైట్ చార్జీలను ప్రభుత్వం ఇటీవల పెంచింది. అయితే ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఉత్తర్వులు అందగానే అమలు చేస్తాం.

– రాజలింగు, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా

వాగులో ఒకరి గల్లంతు

సిరికొండ: మండలంలోని కన్నాపూర్ గ్రామ సమీపంలో చిక్‌మాన్ వాగులో ఓ వ్యక్తి గల్లంతైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన సంగం గంగాధర్(52) గురువారం ఇంద్రవెల్లి మండలంలోని గోపాల్‌పూర్‌లో ఉండే తన కుమారుడి ఇంటికి బయలుదేరాడు. చిక్‌మాన్ వాగు దాటే క్రమంలో గల్లంతయ్యాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం వరకూ గాలించినా ఆచూకీ కానరాలేదు.

అనుమానాస్పదంగా ఆటో డ్రైవర్ మృతి


నవీన్(ఫైల్)

కుంటాల: ఆటో డ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బండారి నవీన్(35) శుక్రవారం ఉదయం ఆటో తీసుకొని బస్టాండ్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన అల్లకొండ శ్రీనివాస్‌కు చెందిన కారు స్టార్ట్ కాకపోవడంతో కారును నెట్టే క్రమంలో అదుపుతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. నవీన్ అనుమానాస్పదంగా మృతిచెందాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం పంపాలని భార్య స్వప్నతో పాటు మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు.

ఎఫ్ఎస్‌వోపై దాడి చేసిన ఇద్దరిపై కేసు


గాయపడిన నర్సయ్య

ఇంద్రవెల్లి: ఎఫ్ఎస్‌వో నర్సయ్యపై దాడిచేసి గాయపరిచిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సునీల్ శుక్రవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని ఇంద్రవెల్లి సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం.నర్సయ్య, ఎఫ్‌బీవో జోత్స్నదేవితో కలిసి శుక్రవారం అటవీ ప్రాంతంలో వెదురు బొంగు మొక్కలు నాటేందుకు బుర్సన్‌పటర్ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లే విలాస్ వ్యవసాయ చేను పక్కన (దూర) నుంచి ట్రాక్టర్ ద్వారా మొక్కలను తరలిస్తుండగా సోన్‌కాంబ్లే విలాస్, అతడి కొడుకు సోన్‌కాంబ్లే సందర్శ్‌లు అసభ్యకరంగా దూషించడంతో పాటు రాళ్లతో దాడి చేశారు. అంతటితో ఆగకుండా కర్రతో తలపై కొట్టగా గాయమైంది. వెంటనే తోటి సిబ్బంది మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఎఫ్ఎస్‌వో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నర్సాపూర్(జి): తిమ్మాపూర్(జి)లో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈవో గణేశ్


నర్సాపూర్(జి): వర్షాలకు దెబ్బతిన్న నందన్ ఎక్స్‌రోడ్డు


లోకేశ్వరం: అర్లి వంతెనను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్

ఎటుచూసినా నష్టమే...

నర్సాపూర్(జి): గురువారం కురిసిన భారీ వర్షంతో పంటలు, రోడ్లు కోతకు గురికాగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని నర్సాపూర్(జి), నందన్, బామిని(బి), గొల్లమాడ, తిమ్మాపూర్(జి), బూర్గుపల్లి(జి), రాంపూర్, టెంబరేణి, చాక్‌పల్లి గ్రామాల్లో పత్తి 330 ఎకరాలు, సోయాబీన్ 100 ఎకరాలు, వరి 168ఎకరాలు, పసుపు 27ఎకరాలు, కంది 50 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఏవో జాదవ్‌సాయి కిరణ్, ఏఈవో గణేష్ పేర్కొన్నారు. గొల్లమాడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏఈ శివ ప్రసాద్ శుక్రవారం పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ దగ్గర రోడ్డు కోతకు గురైంది. నందన్ ఎక్స్‌రోడ్డు వద్ద బీటీ రహదారి కోతకు గురికాగా ఎంపీడీవో అల్లాడి వనజ శుక్రవారం పరిశీలించారు.


బైంసా/బైంసారూరల్: తెగిపోయిన సిరాల ప్రాజెక్టు కట్ట

మళ్లీ కూలిన వైకుంఠధామం ప్రహరీ


దెబ్బతిన్న ప్రహరీ, సీసీ ఫ్లోరింగ్

బైంసాటౌన్: గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరదనీటి ధాటికి రాహుల్‌నగర్‌లోని ఆధునిక వైకుంఠధామం ప్రహరీ మరోసారి కూలింది. గురువారం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో దిగువన సాత్‌పూల్ సమీపంలోని వైకుంఠధామం ఆనవాళ్లు కోల్పోయింది. గతంలో పాక్షికంగా కూలిన ప్రహరీని ఇటీవల రూ.5లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం మరోమారు కూలడంతో ప్రజాధనం నీళ్లపాలైనట్లయింది. దీనికి తోడు వరద ఉధృతికి వైకుంఠధామంలోని దింపుడు గద్దె కొద్దిదూరం కొట్టుకుపోగా సీసీ ఫ్లోరింగ్ కొట్టుకుపోయింది.


కొట్టుకొచ్చిన దింపుడు గద్దె

సిరాల కొట్టుకుపోయింది

- ఊరంతా మహదేవ్ మందిరంలో
- రామస్వామి గుడి కనుమరుగు
- వేల ఎకరాల్లో పంట నష్టం
- మూడుచోట్ల తెగిన ఆయకట్టు

బైంసా/బైంసారూరల్: భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ప్రధాన ఆయకట్టు తెగి నీరంతా ఖాళీ అయ్యింది. గురువారం సాయంత్రం భారీగా ప్రాజెక్టులోకి నీరుచేరింది. ఆయకట్టుపై నుంచి నీరు కిందికి రావడంతో గమనించిన గ్రామస్తులంతా పక్కనే ఉన్న మహదేవ్ ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం దేవుడి మందిరానికి అంతా చేరుకునేలోగా ప్రధాన తూము వద్ద కొంతభాగం గండిపడింది. మరో గంటకు కట్టపై ఉన్న రామస్వామి ఆలయం వద్ద ఇంకో గండి పడింది. రామస్వామి ఆలయం నీటిలోకొట్టుకుపోయింది.

తెగిన ఇలేగాం చెరువు...

సిరాల ప్రాజెక్టు నీటితో ఇలేగాం చెరువు తెగిపోయింది. దీంతో నీరంతా పంటపొలాల్లో ప్రవహించింది.


బైంసా/బైంసారూరల్: మృతిచెందిన గేదె

గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకూ వేలాది ఎకరాల పంట భూములు నీటిలో మునిగిపోయాయి. సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు తెగిపోవడంతో బడ్‌గాం గ్రామ శివారుల్లోని రాజరాజేశ్వర రైస్‌మిల్ ప్రహరీ దెబ్బతింది. రైస్‌మిల్లు ఎదురుగా ఉన్న పశువుల పాక పూర్తిగా నీటమునిగింది. ఇందులో పనిచేసే ఏడుగురు వరదలో చిక్కుకోవడంతో బైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, బైంసారూరల్ సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్, పట్టణ ఎస్సై శ్రీకాంత్‌లు రెస్క్యూటీంతో కలిసి రాత్రంతా పనిచేసి క్షేమంగా బయటకుతీసుకొచ్చారు. వరద ఉధృతికి 12 గేదెలు కొట్టుకుపోగా ఒక గేదె మృతిచెందింది. అలాగే 800 ఎకరాల్లో

అంతా బండరాళ్లే...

శుక్రవారం ఉదయం పంట పొలాల్లోకి వెళ్లి చూస్తే పెద్ద పెద్ద బండరాళ్లు, ఇసుకమేటలు కనిపించాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో 800 ఎకరాల భూములు నీటమునిగాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సిరాల చేరుకున్నారు.

కనుమరుగైన చరిత్ర....

1902లో సిరాల ప్రాజెక్టు నిర్మించారు. 121 ఏళ్ల కింద నిర్మించిన ఈ చెరువు ప్రధాన కట్టపైనే రామస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో రామస్వామి జీవసమాధి అయ్యాడు. సిరాల ప్రాజెక్టు అప్పట్లో అతి తక్కువ ఖర్చుతో రెండు గుట్టలను ఆనుకుని నిర్మించారు. ప్రాజెక్టు నిర్మించిన నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే ఈ ప్రాజెక్టు ఎండిపోయింది.


బైంసా/బైంసారూరల్: సిరాలలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


బైంసా/బైంసారూరల్: పంట పొలాల్లోకి బండరాళ్లు, ఇసుకమేటలు

అర్లి వంతెనపై రాకపోకలు బంద్


కూలడానికి సిద్ధంగా అర్లి వంతెన

లోకేశ్వరం: కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు నిండి పొంగిపొర్లుతున్నాయి. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తివేయడంతో వరద ఉధృతికి దిగువ ఉన్న మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని హవర్గ – అర్లి గ్రామాల వంతెన కోతకు గురై ముందు భాగం కూలిపోవడంతో వంతెనకు బిగించిన బెడ్ వంగిపోయింది. దీంతో అధికారులు గమనించి రాకపోకలు నిలిపివేశారు. కూలిన అర్లి వంతెనను ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్, ఈఈ అశోక్‌కుమార్, డీఈ కొండయ్య, లోకేశ్వరం తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సోలమన్‌రాజ్, ఎస్సై సాయికుమార్‌లు పరిశీలించారు. అర్లి వంతెన మీదుగా వాహనాలు ప్రయాణించకూడదని గ్రామాల్లో చాటింపు వేశారు. అర్లి వంతెనకు నిధులు మంజూరు చేసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్ పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయ్యే వరకూ రాకపోకలు బంద్ చేసినట్లు తెలిపారు.

కోత గురైన రోడ్లు


అందాకూర్ అలుగువద్ద కోతకు గురైన రోడ్డు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన వర్షంతో భారీ నష్టం వాటిల్లింది. కుంటాల–కల్లూర్ ప్రధాన రహదారిపై అందాకూర్ అలుగు వద్ద రోడ్డు కోతకు గురైంది. అందాకూర్ నుంచి పెంచికల్ పాడ్ వెళ్లే మార్గంలో తారురోడ్డు కోతగురై ఆనవాళ్లు కోల్పోయింది. మండలంలోని సుమారు 2,500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

కదలని ఆర్టీసీ బస్సు..!


బస్టాండ్‌లో నిలిపిన ఆర్టీసీ బస్సులు

- ప్రధాన మార్గాల్లో తెగిన రోడ్లు
- నిలిచిన బస్సు సర్వీసులు, ఇబ్బందుల్లో ప్రయాణికులు
- బైంసా డిపోలో నీట మునిగిన కంప్యూటర్ రూం

బైంసాటౌన్: బైంసా డివిజన్ వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో ఆయా మార్గాల్లో అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించలేదు. బైంసా–నిర్మల్ రహదారిలో మాటేగాం వంతెన వద్ద రోడ్డు సగం వరకూ కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. బైంసా– నిజామాబాద్ మార్గంలో సైతం దేగాం వద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బైంసా ఆర్టీసీ డిపో నుంచి నిర్మల్, నిజామాబాద్ రూట్లలో బస్సు సర్వీసులు నిలిపేశారు. నాందేడ్ రూట్లో మాత్రమే బస్సులు నడిపారు. బస్టాండ్‌కు వచ్చిన ప్ర యాణికులు బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేసినట్లు ప్రయాణికులు వాపోయారు.

కంప్యూటర్ గదిలోకి వరద..

బైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు పోటెత్తడంతో ఏడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. దీంతో సుద్దవాగు పరీవాహక ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న బైంసా ఆర్టీసీ డిపోలోకి భారీగా వరద నీరు చేరింది. గతంలో వరదలు వచ్చినా ప్రహరీని ఆనుకుని నీరు ప్రవహించేది. ఈసారి డిపోను పూర్తిగా వరద నీరు ముంచెత్తడంతో డిపో కార్యాలయంలోని గదుల్లోకి నీరు ప్రవేశించి పరికరాలన్నీ దెబ్బతిన్నాయి. కంప్యూటర్ రూమ్‌లోకి నీరు చేరడంతో టిమ్ మెషిన్లు, టికెట్ పేపర్ రోల్, ఇతర సామగ్రి పూర్తిగా చెడిపోయాయి. గదుల్లో, రిపేర్ షెడ్డు బురదమయంగా మారడంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో బురద తొలగింపు చేపట్టారు. డిపోలోని ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో టిమ్ మెషిన్లకు చార్జింగ్ లేక అవి పనిచేయకపోవడంతో సైతం బస్సు సర్వీసులు నిలిపివేసినట్లు తెలిసింది. ఈ విషయమై డీఎం అమృతను వివరణ కోరగా ఆయా మార్గాల్లో రోడ్లు చెడిపోవడంతో సర్వీసులు నిలిపేసినట్లు తెలిపారు.


నీటికి కొట్టుకుపోయిన సామగ్రి తెస్తున్న సిబ్బంది


ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

గుట్టలు, వాగులు దాటి వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాహుల్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిచ్‌ధరి, ఖానాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని అల్లికోరి గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డుమార్గం లేదు. వర్షాకాలం కావడంతో ప్రజలు అనారోగ్యం బారినపడే అవకాశం లేకపోలేదు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండల వైద్యులు గుట్టలు, వాగులు, వంకలు దాటి శుక్రవారం అల్లికోరి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందజేశారు. వర్షాకాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ నారాయణ, సత్యవతి, శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ కళ్యాణ్, ఆశాకార్యకర్త చంగునా బాయి ఉన్నారు.

జలపాతానికి పర్యాటకులను అనుమతించొద్దు

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలపాతానికి భారీగా వరద రావడంతో ఉధృతంగా ప్రవహిస్తోందని, సందర్శకులను జలపాతం వద్దకు అనుమతినివ్వద్దని ఫారెస్టు అధికారులకు ఆదేశించారు. భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ అతికోద్దీన్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రమోద్, ఎంపీవో జీవన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి ఉన్నారు.

నాడు.. నేడు




గోదావరి నది వరదలో మునిగిన ఉమామహేశ్వర ఆలయం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలోని నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వరుడు బుధవారం ఉదయం వరకు భక్తులకు దర్శనమిచ్చాడు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకూ కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉధృతికి ఆలయం నీట మునిగింది. భారీ వర్షం కురవడంతో ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ చేరడంతో శుక్రవారం ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఉమామహేశ్వరుడు నీటి నుంచి తేలి ఎప్పుడు దర్శనమిస్తాడోనని భక్తులు ఎదురుచూస్తున్నారు.

ఆదిలాబాద్‌కు హర్యానా పోలీసులు

- వివాహిత కోసం గాలింపు
- మహిళ మొబైల్ నంబర్ ట్రేస్ చేయడంతో ఇక్కడి లొకేషన్..

ఆదిలాబాద్‌టౌన్: హర్యాన పోలీసులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వివాహిత కోసం గాలింపు చర్యలు చేపట్టడం హైరానాకు గురిచేసింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఆదిలాబాద్ పట్టణానికి చెందిన యువకులు, బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులు గుమిగూడడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. హర్యాన పోలీసులు, బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. హర్యానకు చెందిన ఓ కుటుంబం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఆ కుటుంబ యజమాని ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. పట్టణంలోని ఓ కూడలిలోని జిమ్‌లో ఆయన భార్య ఆరు నెలల క్రితం వ్యాయామం కోసం చేరగా అతడితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆ ఉద్యోగికి తెలియడంతో భార్యను తన సొంత ఊరికి తీసుకెళ్లి అక్కడ ఉంచాడు. రెండుమూడు రోజుల క్రితం భార్య కనిపించకుండా పోయింది. దీంతో హర్యానా రాష్ట్రంలో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆమె ఫోన్ ట్రేస్ చేయడంతో ఆదిలాబాద్‌లో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. శుక్రవారం హర్యాన పోలీసులతో పాటు బాధిత కుటుంబీకులు ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. స్థానికంగా ఉన్న జిమ్ యజమానిపై ఆరా తీయగా అందుబాటులో లేడనే తెలిసింది. ఇదిలా ఉండగా హిందూ సంఘాల నాయకులు జిమ్ యజమానిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా.. వివాహిత అదృశ్యమైన కేసు దర్యాప్తు కోసం ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.


వన్‌టౌన్ సీఐకి వివరిస్తున్న హర్యానా పోలీసు